క్లుప్తంగా

రంజాన్ కిట్ల పంపిణీ



కేసముద్రం: మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద ముస్లిం కుటుంబాలకు, ఇమ్దాద్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను, 25 మంది మహిళలకు చీరలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు ఎండి.నవాజ్అహ్మద్, ఎస్కే.హుసాం, షబ్బీర్, మున్వర్, ఖలీల్, హఫీజ్, నూరుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపి న్యాయం చేయాలి

దోర్నకల్: ప్రభుత్వ భూముల ఆక్రమణపై కొంతకాలంగా ఉద్యమిస్తున్న తనపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా దాడికి కుట్ర చేస్తున్నారని బీజేపీ జిల్లా నాయకుడు కాపరబోయిన సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అమ్మపాలెం గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం తన ఇంటి సమీపంలో ఓ మహిళ ఉద్దేశపూర్వకంగా చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు తన ఇంటికి అంటుకోగా సుమారు రెండు లక్షల రూపాయల కలప ధ్వంసమైందన్నారు. ఈఘటనపై అనేక అనుమానాలున్నాయన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని సత్యనారాయణ కోరారు.

ఆలయంలో చోరీ

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం స్టేజీ సమీపంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆలయం తాళం పగులగొట్టి లోనికి చొరబడి హుండీలో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం గమనించిన ఆలయ నిర్వాహకులు రమేష్, భిక్షంలు పరిశీలించి హుండీలో సుమారుగా రూ.10వేలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

సన్మానం



మహబూబాబాద్ అర్బన్: తీపి చేదు కలిసిందే జీవితం, కష్టం సుఖం తెలిసిందే జీవనం అలాంటి జీవితంలో ఆనందోత్సాహాలను పూరించేందుకు వచ్చింది ఉగాది పర్వదినమని మా అసోసియేషన్, అథ్లెటిక్ అసోసియేషన్ బొడ్డుపల్లి ఉపేంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని బొడ్డుపల్లి నివాసంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సంబురాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ వైద్యులు ఎంఎస్ సివిల్ డాక్టర్ రామకృష్ణ నాయక్‌ను సన్మానించి సత్కరించారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని గుగులోతు భీమానాయక్ మంగళవారం పిలుపునిచ్చారు. నేడు హన్మకొండలోని గిరిజన భవన్‌లో ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. లంబాడ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని భీమానాయక్ పిలుపునిచ్చారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

‘శ్రీ క్రోధి’ ఉగాది సంబురాలు

మహబూబాబాద్ రూరల్: భగవంతుడి అనుగ్రహంతో రైతులు, ప్రజలందరు సిరి సంపదలు, సుఖ శాంతులతో వర్ధిల్లాలని బ్రాహ్మణోత్తములు బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తి అన్నారు. నూతన తెలుగు సంవత్సరాది, శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీతారామచంద్రస్వామివారి దేవాలయంలో మంగళవారం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరై సీతారాముల సన్నిధిలో జ్యోతి ప్రజ్వలన చేసి పంచాంగ శ్రవణం ప్రారంభించారు. పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రంగావఝల సుధాకరశాస్త్రి, సునీత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు చేశారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో ఆయా గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ప్రజలు స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరిపెడ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సర పంచాంగ శ్రవణం పూజారులు చదివి వినిపించారు.

దోర్నకల్: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని దోర్నకల్‌తోపాటు పలు ఆలయాల్లో భక్తులతో సందడి నెలకొంది. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లోని వేంకటేశ్వరాలయంతోపాటు పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

గార్ల: ఉగాది తెలుగు సంవత్సరాది పర్వదినంను పురస్కరించుకొని గార్ల లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణంను అర్చకులు కాండూరి లక్ష్మీనారాయణాచార్యులు గ్రామస్తులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పుల్లఖండం రమేష్‌బాబు, కోట ఉత్తరయ్య, పుల్లఖండం శ్రీనివాస్, డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

పెద్దవంగర: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకను మంగళవారం మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సాయంత్రం పంచాంగ పఠనం చేశారు. అనాధిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం బొమ్మకల్లు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

నెల్లికుదురు/చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలల్లో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన పూజారి వేదాంతం వరదరాజాచార్యులు ముందుగా గణపతి పూజతో ప్రారంభించారు.

నర్సింహులపేట: మండలంలో ప్రజలు ఉదయాన్నే ఇళ్లకు మామిడి తోరణాలను కట్టి, పిండి వంటలు చేసుకున్నారు. సాయంత్రం కాగానే ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పూజారుల వద్ద పంచాంగం శ్రవణంలో పాల్గొన్నారు.



మానుకోటలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు



గూడూరు: పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారి రాజాచార్యులు



పెద్దవంగర: సీతారాముల విగ్రహాలను తీసుకెళ్తున్న గ్రామస్తులు



గార్ల: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



దోర్నకల్: వేంకటేశ్వరాలయంలో..



మహబూబాబాద్ రూరల్: పంచాంగ శ్రవణం చేస్తున్న నర్సింహామూర్తి



నెల్లికుదురు: రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో..



మరిపెడ రామాలయంలో..

ప్రశాంత వాతావరణం కల్పిస్తాం

దోర్నకల్: పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులు కల్పిస్తామని దోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. మండలంలోని చిలుకోడు, పెరుమాళ్లసంకీస గ్రామాల్లో మంగళవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలతోపాటు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో ముస్లిం సోదరులకు కాంగ్రెస్ మండల నాయకుడు భూక్యా రామ్‌కుమార్ లావణ్య దంపతులు మంగళవారం ఇఫ్తార్‌విందు ఇచ్చారు.

నవరాత్రి వేడుకలు ప్రారంభం



గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సీతారామస్వామి నవరాత్రి వేడుకల్లో భాగంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి వేదాంతం వరదరాజాచార్యులు అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం శ్రీ సీతారాములు, అంజనేయస్వామి విగ్రహాలకు నవరాత్రి ఉత్సవాల కోసం ప్రతిష్ఠ జరిపి పూజలు ప్రారంభించారు.

పేదలకు సాయం చేయడంలో సంతృప్తి

మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని హెచ్‌ఆర్‌సీసీఐ రాష్ట్ర చైర్మన్ దబ్బెటి శ్రీనివాస్ అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర మహిళా సెక్రెటరీ ఎస్.రేష్మా రంజాన్ పండుగను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో 25 మంది పేద మహిళలకు దుస్తులు, సామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా దబ్బెటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరివి రోడ్డులో ఆర్వోబీ క్రింద నివాసం ఉంటున్న నిరుపేదల దీన స్థితిని చూసి వారికి దుస్తులు పంపిణీ చేశామన్నారు. పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. నిరుపేదలు నివాసం ఉండే ప్రాంతాలలో ఏ సమస్య హెచ్‌ఆర్‌సీసీఐ సంస్థ ప్రతినిధులు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం పాటుపడతారన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా చైర్మన్ మాందాటి శ్రీనివాస్, జిల్లా వైస్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, సుమన్, విజయ్, పాషా, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఆర్‌సీసీఐ బాధ్యులు

గోర్ జాతిని మతంగా గుర్తించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామ శివారు తండాలో గోర్ సభ జాతీయ సంఘం ఆవిర్భావ సదస్సు మంగళవారం జరిగింది. ఈసందర్భంగా గోర్‌సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. భారతదేశంలో గోర్ జాతిని ఒక మతంగా గుర్తించి రాజ్యాంగంలో చేర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోర్ జనాభా ప్రకారం నిధులు కేటాయించాలని, గోర్‌జాతి ఐక్యత కోసం తండాల్లో, గూడాల్లో, పట్టణాల్లో గోర్ సంస్కృతిని పటిష్ట పర్చాలన్నారు. ఆ తర్వాత సంఘం ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం గోర్ సికో సికావ్ గోర్ సభ క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా కోఆర్డినేటర్ గుగులోతు శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మంగీలాల్‌నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగులోతు ధర్మానాయక్, రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్యరాథోడ్, లచ్చిరాంనాయక్, భిక్షపతి, అర్జున్ చౌహాన్, బాలునాయక్, గుగులోతు వీరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తండ్రి

మహబూబాబాద్ రూరల్: కుమారుడికి తండ్రి తలకొరివి పెట్టిన హృదయవిదారక సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డ ప్రాంతానికి చెందిన పింగిలి వెంకటయ్య కుమారుడు పింగిలి క్రాంతికుమార్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పీఆర్‌ఓ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున ఐదు గంటలకు గుండెపోటుతో మృతిచెందటంతో ఇంటికి తీసుకువచ్చారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉండగా తండ్రి పింగిలి వెంకటయ్య తలకొరివి పెట్టాడు. ఈ సంఘటనను చూసిన బంధువులు, స్థానికులు బోరున విలపించారు.

బెరైటీస్ గుట్ట పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

గార్ల: ‘మైనింగ్ దందా’ అనే శీర్షికన గత 2రోజుల క్రితం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని బెరైటీస్ ఖనిజం మైనింగ్ గుట్టల ప్రాంతాన్ని అటవీశాఖ డీఆర్‌ఓ రమేష్ తన సిబ్బందితో సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖనిజ అక్రమ రవాణాను నివారించేందుకు ఈ మైనింగ్ గుట్టల వద్ద ఇద్దరు బేస్ క్యాంపు వాచర్లను నియమించామని, సిబ్బంది రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఖనిజాన్ని ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తే 99497 28031కు వెంటనే సమాచారం ఇవ్వాలని, అట్టి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఇకనుంచి ఎవరైనా అక్రమంగా బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామివారి 66వ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సీతారామ కల్యాణోత్సవ కమిటీ సభ్యులు చాడవరపు మోహన్‌రావు, ఓంనారాయణలోయ, పుప్పాల రమేష్‌బాబు, తదితరులు రాములోరికి పూజలు నిర్వహించి, రథంలాగి, ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తి, ఆలయ ప్రధానార్చకులు ఎంవీ కృష్ణప్రసాద్, ప్రోగ్రాం కన్వీనర్ ఊటె గురునాథరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల రథం లాగుతున్న ఎమ్మెల్యే

ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న చరణ్ గౌడ్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపు మేరకు సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి అనాథ ఆశ్రమాల్లో పిల్లలకు పండ్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు బల్లెం చంటి, ఉపాధ్యక్షుడు సాయి రాజీవ్ కృష్ణ, ఉదయ్ నాయుడు, అక్కినపల్లి అజయ్, వరిపల్లి రాకేష్, దారావత్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, యాచకులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలతో భక్తిభావం పెంపొందుతుంది

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో సంప్రదాయ బద్ధంగా నిర్వహించే కుల దేవత పండుగలతో ప్రతి వ్యక్తిలో భక్తిభావం పెంపొందుతుందని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు.. మంగళవారం మండలంలోని పెద్ద మంగ్యా తండాలో నూతనంగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ దేవత పండుగ వేడుకల్లో తండా పెద్దలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిన్న మంగ్యా, జాటోతు రమేష్, పెద్దలు జాటోతు యాకేష్, సంపత్, భరత్, హరీశ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్, తండా పెద్దలు

ఇక పల్లెల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు

- ఆరోగ్యశ్రీ నుంచి ఆయుష్మాన్ భారత్‌లోకి..
- కొత్త రంగులతో కళకళలాడుతున్న సర్కారు ఆస్పత్రులు
- ఆరురకాల వైద్య సేవలతోపాటు ప్రతీ నెలా హెల్త్ మేళా



మండల కేంద్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

గూడూరు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్కార్ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నాయి. గతంలో పట్టణ కేంద్రాల్లోని పెద్ద పెద్ద ఆస్పత్రుల్లోనే ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం అందుతుందన్న ప్రజల నమ్మకాన్ని తిరిగి అంతకు రెట్టింపు నమ్మకం కల్గించేలా ఆరోగ్యశ్రీ నుంచి ఆయుష్మాన్ భారత్‌లోకి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ఆరోగ్య ఉప కేంద్రాలను చేర్చారు. మండల స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలుగా వైద్యసేవలు అందించేవి.

మానుకోట జిల్లాలో మొత్తం 20ప్రాథమిక ఆస్పత్రులు, 173 ఆరోగ్య ఉపకేంద్రాలు, 1 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 1బస్తీ దవాఖాన ఉన్నాయి. జిల్లాలో 173 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా, వాటిలో 34 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలుగా ఉంచి, మిగతావి 139 ఆరోగ్య ఉప కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే దిశగా ఎంపిక చేశారు. వాటి పేరు హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలుగా పెట్టి వైద్యసేవలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ ఆస్పత్రుల భవనాలకు ముదురు పసుపు రంగు వేయించగా, కొత్త శోభ సంతరించుకొని కళకళలాడుతున్నాయి. కాగా గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రులను మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం వాటి పేర్లను ''ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ''లుగా పేరు మార్చింది. తిరిగి కొత్త రంగులతో వైద్య సేవలు ప్రతిబింబించేలా ఆరు లోగోలతో ఆస్పత్రుల గోడలపై గీసిన బొమ్మలు వేయించారు.

ఆకర్షణీయంగా..

మొదట్లో ఆరోగ్య ఉప కేంద్రాలుగా, తరువాత హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లుగా సేవలందించిన ఈ ఆస్పత్రులు కొత్తగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లుగా మారాయి. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆస్పత్రులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలన్నీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో ఒక వైద్యుడితోపాటు స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఉంటారు. కాగా వివిధ రుగ్మతల బారిన పడిన వారికి అందించే వైద్య సేవలు ప్రతిబింబించేలా ఆరు లోగోలతో ఆస్పత్రుల గోడలపై గీసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. మాతా శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాలు, యోగా మెడిటేషన్, హెల్త్ హెడ్యుకేషన్ ప్రాధాన్యతను చాటేలా బొమ్మలు గీయించారు.

వైద్యసేవలు అందుబాటులోకి..



గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందనున్నాయి. ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆయుష్మాన్ భారత్ కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లుగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కేంద్రాల్లో ఆరురకాల వైద్యసేవలతోపాటు ప్రతీ నెలా హెల్త్ మేళా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తారు.

- కళావతి బాయి, డీఎంహెచ్ఓ

బొలెరో వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు

గార్ల: ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టి ఒకరి మృతికి కారకుడైన వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన దబ్బేటి బుచ్చిరాములు తన ఆటోలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ సమీపంలోని జామాండ్లపల్లిలో ఓ శుభ కార్యానికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని ఆటోకు లైట్లు వెలగక పోవడంతో, ఆటోను రోడ్డు పక్కకు ఆపి ఆటోను పరిశీలిస్తున్నాడు. ఇల్లెందు నుంచి అతివేగంగా వస్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ బుచ్చిరాములు అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



కేసముద్రం: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తరాల అర్చన, వీరేష్‌యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు సంజీవరెడ్డి, వెంకన్న, అయూబ్‌ఖాన్, నాగరాజు, దయాకర్, వసంతరావు, రమేష్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్ పాల్గొన్నారు.